

రాములోరి హుండీల ఆదాయం రూ.24 లక్షలు


పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామ స్వామివారి దేవస్థానంలోని హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. - 8లో



వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి వియనగరం జిల్లాలో బుధవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. - 8లో

నిప్పుల వాన



విజయనగరం జిల్లాలో మూడు రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. భానుడు బుధవారం నిప్పుల వాన కురిపించాడు. వడగాల్పుల నుంచి రక్షణగా తువ్వాళ్లు, మర్ఫీలు, చీరకొంగులు, చున్నీలు కప్పుకుని రాకపోకలు సాగించారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

న్యూస్‌రీల్

ప్రత్యేక బోధనతో శతశాతం ఉత్తీర్ణత

- డీఈఓ లింగేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం అర్బన్: పదోతరగతి పరీక్షలో ఫెయిలైన విద్యార్థులందరూ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక బోధన ప్రణాళిక అమలుచేయాలని హెచ్‌ఎంలకు డీఈఓ లింగేశ్వరరెడ్డి సూచించారు. శతశాతం ఉత్తీర్ణత నమోదుకు కృషిచేయాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరలో విజయనగరం డివిజన్ పరిధిలోని ఎంఈఓలు, హెచ్‌ఎంలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో చదివి పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ ఇంటర్మీడియట్‌లో చేరేలా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. జిల్లాలో రెండో విడతలో చేపట్టిన 'మన బడి నాడు–నేడు' పనులను షెడ్యూల్ ప్రకారం పూర్తిచేయాలని ఆదేశించారు.

విజయనగరం డీఎస్పీగా గోవిందరావు



విజయనగరం క్రైమ్: విజయనగరం డీఎస్పీగా ఆర్.గోవిందరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కోస్టల్ సెక్యూరిటీ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న గోవిందరావును ఇటీవల విజయనగరం డీఎస్పీగా నియమిస్తూ రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 1991 ఎస్‌ఐ బ్యాచ్‌కు చెందిన గోవిందరావు గతంలో ఎస్‌ఐ, సీఐగా జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ, విజయనగరం రూరల్, వన్ టౌన్, కొత్తవలసలో పనిచేశారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖ పరిధిలోని ఐడీఎస్‌పీలో ఎపిడిమాలజిస్టు పోస్టుకు సంబంధించిన ప్రావిజనల్ మెరిట్ జాబితా విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలను 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలియజేయాలన్నారు.

డెంటల్ టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆర్‌బీఎస్‌కెలో డెంటల్ టెక్నీషియన్ పోస్టులు–2, ఆడియాలజిస్టు కమ్ స్పీచ్ థెరపిస్టు –1 పోస్టులకు ఈనెల 15వ తేదీలోగా అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ కోరారు. విద్యార్హత వివరాలు వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.

డీఈఈ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 28లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి
- ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతినాయుడు



ప్రభుత్వ డైట్ కళాశాల

నెల్లిమర్ల: డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఈ) సెట్–2023కు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ తిరుపతినాయుడు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేయదలిచే బీసీ, ఓసీ విద్యార్థులు ఇంటర్మీడియట్ 50 శాతం మార్కులతోనూ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ నెల 10 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్లో రూ.750 ఫీజు చెల్లించాలన్నారు. 11 నుంచి 28 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. వచ్చే నెల 5న ఆన్‌లైన్లో హాల్ టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. వచ్చే నెల 12, 13 తేదీల్లో ఆన్‌లైన్లో డీఈఈ సెట్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. 19వ తేదీన పరీక్ష ఫలితాలు వెలువడతాయని పేర్కొన్నారు. 20, 21 తేదీల్లో మొదటి విడత కౌన్సెలింగ్, 22 నుంచి 27 వరకు అభ్యర్థులకు వెబ్ ఆప్షన్స్ ఉంటాయన్నారు. వచ్చే నెల 28, 29, 30 తేదీల్లో సీట్ల కేటాయింపు లెటర్లు అందజేస్తామని పేర్కొన్నారు. జూన్ 31 నుంచి జూలై 6వ తేదీవరకు సర్టిఫికెట్లు పరిశీలించి, ప్రవేశ పత్రాలు అందజేస్తామని తిరుపతినాయుడు వివరించారు. ప్రభుత్వ డైట్ కళాశాలలో 100 సీట్లు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు గడువులోగా డీఈఈ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఖరీఫ్ సాగుకు ప్రణాళిక సిద్ధం

- జిల్లాలో 1,21,153 హెక్టార్లలో పంటల సాగువుతాయని అంచనా
- వరి పంట సాధారణ విస్తీర్ణం 93,645 హెక్టార్లు
- 43,606 క్వింటాళ్ల విత్తనాలు, 47,787 మెట్రిక్ టన్నుల ఎరువుల కేటాయింపు
- సాగుపెట్టుబడిగా వైఎస్సార్‌రైతు భరోసా
- ఆర్‌బీకేలు కేంద్రంగా సాగుప్రణాళికలు అమలు



పొలం దున్నుతున్న రైతు

విజయనగరం ఫోర్ట్:

ఖరీఫ్ సీజన్‌కు ముందే అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు వేసవి దుక్కులు చేయడంలో బిజీ అయ్యారు. ఖరీఫ్ పంటల సాగుకు భూమిని సిద్ధం చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఖరీఫ్ సాగుప్రణాళికలను సిద్ధం చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చే పనిలో నిమగ్నమయ్యారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించేందుకు కూడా ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు పూర్తిచేస్తోంది.

ఏ నెలకు ఏ విత్తనం:



వరి: వరి పంటకు సంబంధించి జిల్లాలో మధ్యకాల రకాలు సాగు చేసుకోవాలి. ఈ రకాలను చెరువు ఆయకట్టు, ఎర్రరేగడి నెలల్లో వేసుకోవాలి. ఎంటీయూ–1121, స్వర్ణ, సోనామసూరి, సాంబమసూరి, ఎన్ఎల్ఆర్ 34449, ఎంటీయూ–1153 రకాలు జిల్లాలో సాగుకు అనుకూలం. నీరుపారే పొలాల్లో ఎంటీయూ–1064, ఎంటీయూ–1061 రకాలను వేసుకోవాలి.



పత్తి: పత్తిని నల్లరేగిడి నేలల్లో వేసుకోవాలి. పత్తికి సంబంధించి జబర్ధస్త్, జాదు, ఏటీఎం, మనీవాకర్ రకాలను వేసుకోవాలి.



మొక్కజొన్న: మొక్కజొన్నను ఇసుకతో కూడిన ఎర్ర నేలల్లో వేసుకోవాలి. కేఎంహెచ్–50,244, ద్రోణ రకాలను వేసుకోవాలి.



చెరకు: వర్షాధారం, బోర్లు కింద అయితే 85ఎ261, 83ఎ30 ,83ఎ30 రకాలను వేసుకోవాలి. నల్లరేగిడి నేలల్లో అయితే విశ్వామిత్ర రకాన్ని వేసుకోవాలి.

నవధాన్యాల సాగు:

భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువుల స్థానంలో నవధాన్యాలు సాగుచేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. నవధాన్యాల సాగుచేయడం వల్ల భూసారం పెరుగుతుంది. నత్రజని ఎరువులు పెద్దగా అవసరం ఉండదు.

వరి నారుమడి 10 సెంట్లలో వేసుకోవాలి:

విత్తనాలను నారు వేసే ముందు నీటిలో తేలియాడించాలి. ఎకరానికి 10 సెంట్లలో నారుమడిని సిద్ధం చేసుకోవాలి. నీటిలో తేలియాడిన విత్తనాన్ని తీసివేసి కింద వాటిని నాటుకోవాలి. 10 సెంట్లు నారుమడికి 500 కిలోల పశువుల గెత్తం వేయాలి. ఎకరానికి సాధారణ పద్ధతిలో 30 కేజీల వరి విత్తనాలు వేసుకోవాలి. 30 కేజీల విత్తనాన్ని 5 లీటర్ల బీజామృతంతో విత్తన శుద్ధిచేయాలి.

ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం ఇది...

జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 1,21,153 హెక్టార్లు. ఇందిలో వరి పంట సాగు విస్తీర్ణం 93,645హెక్టార్లు. మిగిలిన విస్తీర్ణంలో మొక్కజొన్న, చోడి, పత్తి, వేరుశనగ, గోగు, మిరువ, చెరకు తదితర పంటలను రైతులు సాగుచేయనున్నారు.

ఖరీఫ్‌లో పంటల సాగు సాధారణ విస్తీర్ణం హెక్టార్లలో...

పంట రకం	విస్తీర్ణం
వరి	93,645
జొన్న	02
సజ్జ	25
మొక్కజొన్న	12,250
చోడి	40
సామ,కొర్రలు	14
అపరాలు	191
మిరప	51
వేరుశనగ	350
నువ్వులు	7,310
పత్తి	2,030
చెరకు	4,504
గోగు	429

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సన్నద్ధమవుతున్నాం. విత్తనాలు, ఎరువుల కేటాయింపులకు సంబందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు సరఫరా ప్రారంభమైంది. నెలఖారుఖకు రైతు భరోసా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో విత్తనాలు , ఎరువులు నిల్వ చేస్తాం. అనంతరం రైతులకు పంపిణీ చేస్తాం.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి



విత్తన కేటాయింపు ఇలా..

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలు 42,308 క్వింటాళ్లు అవసరంగా వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఆ మేరకు జిల్లాకు విత్తన కేటాయింపు జరిగింది. ఇందులో బీపీటీ–229 రకం 4,520 క్వింటాళ్లు, బీపీటీ 5,204 రకం 2,289 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 రకం 30 క్వింటాళ్లు, ఎంటీయూ 1054 రకం 2,600 క్వింటాళ్లు, ఎంటీయూ 1121రకం 30,000 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం 306 క్వింటాళ్లు, ఎంటీయూ 7029 రకం 1950 క్వింటాళ్లు, ఎన్ఎల్ఆర్ 3449 రకం 27 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ 2537 రకం 204 క్వింటాళ్లు, ఎంటీయూ1318 రకం 382 క్వింటాళ్లు కేటాయించారు.

ఆర్‌బీకేలకు చేరిన ఎరువులు



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 47,787 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరంగా గుర్తించారు. ఇందులో యూరియా 25,301 మెట్రిక్ టన్నులు, డీఏపీ 10,478, పొటాష్ 3,088, కాంప్లెక్సు ఎరువులు 7,508, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 1412 మెట్రిక్ టన్నులను ఆర్‌బీకేలకు దశలవారీగా చేర్చుతున్నారు.

ప్రజల సంక్షేమమే ప్రగతి సూచిక

- సామాజిక న్యాయం దిశగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన
- రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షుడు, సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్

విజయనగరం అర్బన్: ప్రజల సంక్షేమమే నిరంతర అభివృద్ధికి, ప్రగతికి అసలైన నిర్వచనమని రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారుడు జూపూడి ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్థికవేత్త అమర్త్యసేన్ నిర్వచనం ప్రకారం అభివృద్ధి అంటే సంక్షేమం రూపంలో ప్రజలకు అందుతున్న ఆర్థిక సాయమేనని ఉద్ఘాటించారు. విజయనగరం జిల్లాకు బుధవారం విచ్చేసిన ఆయన జిల్లా పరిషత్ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో బృహత్తర కార్యక్రమాలు చేపట్టిందన్నారు. సంక్షేమ పథకాలతో అట్టడుగు వర్గాల్లో ఆర్థికోన్నతి కనిపిస్తోందన్నారు. దీనిలో భాగంగానే రాష్ట్రంలో కూడా దళిత బంధు పథకం ప్రవేశపెట్టే యోచన ఉందని విలేకరి అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు దళితులతో ఆడుకునేవని, ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు దళితుల సంక్షేమానికి చేసి నది శూన్యమని విమర్శించారు. 14 సంవత్సరాల చంద్రబాబు పాలనతో నాలుగేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనను పోల్చిచూస్తే ప్రజలకు కలిగిన లబ్ధి తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో 1.4 కోట్ల మంది పేదల ఖాతాలకు 2.8 లక్షల కోట్ల లబ్ధిని అవినీతికి తావివ్వకుండా నేరుగా జమచేస్తున్న విధానం అద్భుత మన్నారు. పేదలు ఆర్థికోన్నతి చెందుతున్నారన్నది పక్కనపెట్టి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారన్న అబద్ధాలను పచ్చమీడియా ప్రచారం చేస్తోందన్నారు. ఎస్సీసెల్ ప్రతినిధులు రాజబాబు, వెంకటరావు, శ్రీనివాసరావు, జయప్రద, జైహింద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెరకు సాగుకు రాయితీలు

- ఈఐడీ ప్యారీ కర్మాగారం ఏజీఎం(కేన్) అప్పారావు



సీతానగరం: ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం పరిధిలో చెరకు ఉత్పత్తి చేస్తున్న రైతులకు ఏపీ రాష్ట్ర చక్కెర పరిశ్రమల శాఖ సూచనల మేరకు రాయితీలు ఇవ్వాలని సంకిలిలోని ఈఐడీ ప్యారీ లిమిటెడ్ యాజమాన్యం నిర్ణయించిందని ఏజీఎం(కేన్) కె.అప్పారావు తెలిపారు. సీతానగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023 ఏప్రిల్ 30లోగా చెరకు నాటిన రైతులకు ఇచ్చే రాయితీలను సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్టు తెలిపారు. కొత్తగా సాగుచేస్తే ఎకరా విస్తీర్ణానికి రూ.8 వేలు, మమ్ముతోటకు రూ.2వేలు చొప్పున చెల్లిస్తుందన్నారు. 2024 జనవరి 16 నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోగా చెరకు సరఫరా చేసిన రైతులకు రాయితీలతో పాటు మొక్క, మమ్ముచెరకకు టన్నుకు అదనంగా రూ.75 చెల్లించాలని యాజమాన్యం నిర్ణయించిందన్నారు. 2024 మార్చి 1 నుంచి క్రషింగ్ సీజన్ ముగిసేంత వరకూ చెరకు సరఫరా చేసిన రైతులకు మొక్క, మమ్ము చెరకు టన్నుకు రూ.125లు అదనంగా చెల్లిసుందన్నారు. రాయితీలను సద్వినియోగం చేసుకుని, సాగు విస్తీర్ణాన్ని పెంచాలని రైతులను కోరారు.

ప్రశాంతంగా పాలిసెట్-2023

- 88.15 శాతం మంది హాజరు



పరీక్ష కేంద్రం వద్ద రూమ్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

విజయనగరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో 2023 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు బుధవారం నిర్వహించిన పాలిసెట్–2023 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ప్రవేశ పరీక్షకు 9,414 మంది దరఖాస్తు చేసుకోగా జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 8,298 మంది హాజరయ్యారు. 1116 మంది గైర్హాజరయ్యారు. విజయనగరం జిల్లా కేంద్రంలో 14 పరీక్ష కేంద్రాల్లో 4,562 మంది హాజరు కాగా 378 మంది గైర్హాజరయ్యారు. బాలురు 2,625 మంది, బాలికలు 1937 మంది పరీక్ష రాశారు. బొబ్బిలిలోని 9 కేంద్రాల్లో 2127 మంది పరీక్షకు హాజరు కాగా 417 మంది గైర్హాజరయ్యారు. వీరిలో బాలురు 1375 మంది, బాలికలు 752 మంది పరీక్ష రాశారు. గజపతినగరంలో 7 కేంద్రాల్లో 1609 మంది పరీక్షలు రాయగా, 321 మంది గైర్హాజరయ్యారు. వీరిలో బాలురు 1022 మంది, బాలికలు 587 మంది పరీక్ష రాశారు. అత్యధికంగా విజయనగరంలో 92.35 శాతం హాజరు నమోదు కాగా బొబ్బిలిలో 83.61 శాతం, గజపతినగరంలో 83.37 శాతం హాజరు నమోదైంది. పరీక్షల ఏర్పాట్లను జిల్లా కన్వీనర్, విజయనగరం ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి పర్యవేక్షించారు. ఉదయం 11 గంటల తర్వాత వచ్చిన విద్యార్థులకు అనుమతించలేదు.

'జగనన్నకు చెబుదాం'తో సమస్యలకు సత్వర పరిష్కారం

- 1902 ద్వారా మిషన్ మోడ్‌లో ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం
- విలేకరుల సమావేశంలో కార్యక్రమ లక్ష్యాలను వివరించిన కలెక్టర్ నాగలక్ష్మి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పాల్గొన్న జేసీ మయూర్‌అశోక్

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా అత్యున్నత స్థాయిలో ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉద్దేశాలు, లక్ష్యాలను జేసీ మయూర్ అశోక్, డీఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ వెల్లడించారు.

ప్రజలు తమ ఇంటి వద్ద నుంచే ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలపై సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1902కు కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. సంబంధిత సమాచారాన్ని కూడా తెలుసుకోవచ్చని తెలిపారు. సమస్యలు పరిష్కరించిన తర్వాత కాల్ సెంటర్ ప్రతినిధి స్వయంగా ఫోన్ చేసి సంబంధిత ఫిర్యాదుదారు నుంచి అభిప్రాయాన్ని కూడా సేకరించే బృహత్తరమైన కార్యక్రమం జగనన్నకు చెబుదాం అని అభివర్ణించారు. అధికారులు కూడా బాధ్యతగా వ్యవహరించి ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని ఆదేశించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న స్పందనకు ఇది మరింత మెరుగైన రూపమని, సేవల విస్తృతికి ఈ వేదిక దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం జరిగే స్పందన యథావిధిగా సాగుతుందని స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాం అనేది స్పందన 2.0గా పరిగణించాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించేందుకు వీలుగా జిల్లా స్థాయిలో జెడ్పీ సీఈఓ, ప్రత్యేక ఉప కలెక్టర్, పంచాయతీ రాజ్ అధికారి, ఒక డిప్యూటీ తహసీల్దార్, మెడికల్ అధికారి, సీపీఓ, సాంకేతిక విభాగం నుంచి ఒక అధికారితో ప్రత్యేక బృందాలను నియమించామని చెప్పారు. ఆడిట్ టీమ్, మానిటరింగ్ టీంలు ప్రత్యేక సేవలందిస్తాయని తెలిపారు. ఇక్కడ నమోదయ్యే ఫిర్యాదులను నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయ పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజా వినతుల పరిష్కారంలో నాణ్యతను సాధించడం, సకాలంలో వినతులను పరిష్కరించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పనిచేస్తాయని వివరించారు. 1902కు ఫోన్ చేయటం ద్వారా ప్రజలు ప్రభుత్వ సేవలకు, సంక్షేమ పథకాలు, ఇతర వ్యక్తిగత స్థాయిలో ఉండే ఎలాంటి సమస్యలైనా చెప్పుకోవచ్చని స్పష్టం చేశారు. ఫిర్యాదు స్వీకరించిన తర్వాత ప్రత్యేక వైఎస్ఆర్ (యువర్ సర్వీస్ రిక్వెస్ట్) ఐడీ వస్తుందని దాని సహాయంతో ఎప్పికప్పుడు మెసేజ్ రూపంలో ఫిర్యాదు అప్‌డేట్స్ వస్తాయని వివరించారు.

ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు

ప్రజలకు మెరుగైన రీతిలో సేవలందించేందుకు వీలుగా ప్రభుత్వ ఉద్యోగులందరికీ వివిధ దశల్లో ప్రత్యేక శిక్షణ శిబిరాలను నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు తీసుకునే చర్యలను వివరిస్తామన్నారు. జిల్లా, డివిజన్ స్థాయి శిక్షణలు అనంతరం, సచివాలయ ఉద్యోగులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ప్రతిదశలో ప్రజలకు మెరుగైన రీతిలో సేవలందించటంతో పాటు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించేలా తర్ఫీదు అందిస్తామని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ వివరించారు.


చకచకా అభివృద్ధి పనులు

- డిసెంబర్‌లోగా రూ.6.50కోట్ల ఆర్థిక సంఘం పనులు పూర్తిచేయాలి
- శివరాంపురం బ్రిడ్జి పనులపై పీఆర్ ఎస్ఈతో చర్చించిన మంత్రి బొత్స

బొబ్బిలి(సాలూరు): వివిధ అభివృద్ధిపనులను చకచకా పూర్తిచేయాలని, సాలూరు మున్సిపాలిటీలో ప్రతిపాదిత 15వ ఆర్థిక సంఘం పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మున్సిపల్ కమిషనర్ హనుమంతు శంకరరావును ఆదేశించారు. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర క్యాంపు కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే బాధ్యత తీసుకుంటామన్నారు. ఇబ్బందులు వస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మున్సిపాలిటీలోని శాఖా గ్రంథాలయానికి ప్రభుత్వ స్థలం ఉన్నా మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం కోసం అజెండాలో పొందుపరచడం లేదని మంత్రి దృష్టికి తీసుకురాగా... వెంటనే కమిషనర్‌తో మాట్లాడారు. వచ్చే సమావేశంలో ఆ స్థలం కేటాయించేందుకు అజెండాలో పొందుపరచాలని సూచించారు. సాలూరు నియోజకవర్గంలోని మెంటాడలో 510 ఎకరాల్లో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకానుందన్నారు. సాలూరు మండలంలోని పవర్ ప్లాంట్‌నిర్మాణం శివరాంపురం బ్రిడ్జి నిర్మాణం తరువాత ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. మంత్రి రాజన్నదొర మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మిస్తామని చెబుతూ టీడీపీ నాయకులు ఈ ప్రాంతీయులను ఉసూరుమనిపించారన్నారు. ఇప్పుడు సాకారం అవుతుందని స్పష్టం చేశారు.

భవిష్యత్తు బంగారు మయం కావాలి

గిరిజన విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం కావాలని మంత్రి బొత్ససత్యనారాయణ, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆకాంక్షించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన గిరిజన విద్యార్థుల ఆరిక చరణ్‌తేజ, నిమ్మక వివేక వర్ధన్, సవర అనిల్‌కుమార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వి.అప్పలనాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రైడ్డి పద్మావతి, పట్టణ అధ్యక్షురాలు రాంబాయి, వైస్ ఎంపీపీ, రెడ్డి సురేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, గురుకులాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రులు బొత్స, పీడిక



విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

క్లుప్తంగా

బాల్య వివాహం అడ్డగింత



పెళ్లివారికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ వియ్యంపేట ప్రాజెక్టు సీడీపీఓ ఆర్.ఉమాదేవి ఆధ్వర్యంలో అధికారులు బుధవారం అడ్డుకున్నారు. గ్రామంలో తక్కువ వయస్సు గల అమ్మాయికి పెళ్లి జరుగుతోందని సమాచారం అందడంతో ఎస్సై బి.దేవి, ఈఓపీఆర్డీ ధర్మారావు తదితర అధికారులతో పెళ్లివారి ఇంటికి ఆమె వెళ్లారు. అమ్మాయికి సంబంధించిన వయస్సు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించగా 10వ తరగతి సర్టిఫికెట్ కలర్ జిరాక్స్‌ను తల్లిదండ్రులు అధికారులకు చూపారు. ఆ సర్టిఫికెట్‌ను సంబంధిత పాఠశాలలో పరిశీలించగా తప్పుడు పుట్టిన రోజు వేసి కలర్ జిరాక్స్ తీసినట్లు అధికారులు గుర్తించి పెళ్లిని ఆపాలని సూచించారు. మరో ఏడాది పోయిన తరువాతే పెళ్లి జరిపించాలని కుటుంబసభ్యులకు హితవు పలికారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ పెళ్లి గురువారం తెల్లవారుజామున జరగాల్సి ఉంది. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

రాములోరి హుండీ ఆదాయం రూ.24 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామివారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఈ మేరకు మూడు నెలలకు గానూ దేవస్థానంలో ఉన్న హుండీల ద్వారా రూ.24,64,540 ఆదాయం లభించిందని ఈఓ కిశోర్ కుమార్ తెలిపారు. లభించిన ఆదాయాన్ని దేవస్థాన ఏపీజీవీబీ ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు హుండీ లెక్కింపును దగ్గరుండి పర్యవేక్షించారు. పలు ప్రాంతాలకు చెందిన స్వామి సేవా భక్తులు ఆదాయాన్ని లెక్కించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులపై దృష్టి సారించాలి

- డీఈఓ లింగేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వర రెడ్డి

బొబ్బిలి: పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల పట్ల హెచ్‌ఎంలు దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వర రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ట్రిపుల్‌ఎస్ డిగ్రీ కాలేజ్‌లో డివిజన్‌లోని అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చూడడం, వారు ఏఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి వాటిపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే నాడు నేడు పనుల పూర్తికి ఆయా కాంట్రాక్టర్లను త్వరితగతిన సంసిద్ధం చేయాలని ఆదేశించారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు వెంటనే రంగంలోకి దిగాలని సూచించారు. ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 485.00
విజయనగరం	రూ. 489.00
శ్రీకాకుళం	రూ. 489.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,850–00
బంగారం(22సి. 10గ్రా.)	56,700–00
వెండి (కిలో)	82,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹142	₹254	₹ 264

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఆయా ప్రమాద సంఘటనలపై మృతుల కుటుంబ సభ్యులు, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

–సాక్షి నెట్‌వర్క్

- మరో ఇద్దరికి గాయాలు



పార్వతీపురం: మురళి మృతదేహం



పార్వతీపురం: చికిత్స పొందుతున్న సోములు

బంధువుల ఇంట పెళ్లికి హాజరయ్యేందుకు మెంటాడ మండలం కొండమామిడి వలస గ్రామానికి చెందిన బోయిన మురళి(26), స్నేహితుడు గుమ్మడి సోములుతో కలిసి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ఈ క్రమంలో పార్వతీపురం మండలం నిమ్మలవానివలస గ్రామానికి వెళ్తుండగా పుట్టూరు గ్రామసమీపంలో బైక్ అదుపుతప్పి ఎదురుగా ఉన్న సిమెంట్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో మురళి ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సోములుకు తీవ్రగాయాలు కావడంతో కోమాలోకి చేరుకున్నాడు. తక్షణమే స్పందించిన స్థానికులు 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి క్షతగాత్రుడిని, మృతుడిని తరలించారు.

ఆటోను బైక్ ఢీకొని వ్యక్తి..

వీరఘట్టం మండలంలోని సీఎస్‌పీ రహదారి మరియగిరి సమీపంలో చీపురుపల్లి మండలం బాతువ గ్రామానికి ధనుకోటి జోగినాయుడు(43) మృతిచెందాడు. వీరఘట్టంలో జరుగుతున్న గ్రామదేవత పండగకు బంధువుల ఇంటికి బావమరిది రెడ్డి పైడిరాజుతో కలిసి జోగినాయుడు బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో పండగ సంబరాలు ముగించుకుని ఓ కుటుంబం ఆటోలో వెళ్తోంది. ఎదురుగా వస్తున్న ఆటోను బైక్‌పై వస్తున్న జోగినాయుడు ఢీ కొట్టాడు. అదే సమయంలో వెనుకగా వస్తున్న మరో బైక్ కూడా వీరి బైక్‌ను బలంగా ఢీ కొట్టడంతో జోగినాయుడు, పైడిరాజులు రోడ్డుపై పడి గాయాలపాలయ్యారు. వారిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే జోగినాయుడు చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. గాయాలపాలైన పైడిరాజుకు చికిత్స అందజేశారు.



వీరఘట్టం: జోగినాయుడు మృతదేహం

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొని మరో వ్యక్తి..

పూసపాటిరేగ మండలంలోని గైతులచోడవరం సమీపంలో ఆగి వున్న వ్యాన్‌ను మోటార్ సైకిల్ ఢీకొనడంతో కొవ్వాడ గ్రామానికి చెందిన చింతపల్లి సూర్యనారాయణ (45) మృతి చెందాడు. అరబిందో పరిశ్రమలో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సూర్యనారాయణ విధులు ముగించుకుని మోటార్‌సైకిల్‌పై ఇంటికి వస్తుండగా గైతులచోడవరం సమీపంలో జాతీయరహదారిపై ఆగి ఉన్న వ్యాన్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. గాయపడిన వ్యక్తిని విజయనగరంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.



పూసపాటి రేగ: సూర్య నారాయణ మృతదేహం

గూడ్స్ ఢీకొని లారీ డ్రైవర్..



శృంగవరపు కోట: గూడ్స్ ఢీకొట్టి చనిపోయిన సతీష్

శృంగవరపుకోట మండలంలోని వెంకటరమణపేట శివారు దాంపురం గ్రామం సమీపంలో వేపాడ మండలం కొండగంగుబూడి గ్రామానికి చెందిన రాయవరపు సతీష్(30) గూడ్స్ రైలు ఢీకొని మృతి చెందాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న సతీష్ విధి నిర్వహణకు వెళ్తున్న క్రమంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

విద్యుత్ షాక్‌తో వలసకూలీ..

పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కత్తాకు చెందిన ఐదుగురు వ్యక్తులు జియో కేబుల్ లైన్ వేసే పనికోసం 15రోజుల క్రితం శృంగవరపు కోట వచ్చారు. అప్పటి నుంచి పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు జియో ఫైబర్ కేబుల్ వైరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం శ్రీనివాసకాలనీలో బ్యాంక్ అప్పారావు ఇంటి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కిన ముస్లిం యువకుడు అఫ్రోజ్(25) క్లాంప్ బిగిస్తుండగా పైన ఉన్న హెచ్‌టీ లైన్ తలకు తగలింది. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. అఫ్రోజ్‌ను కోలకత్తా–2లో మాల్దా జిల్లా, సుజాపూర్ రోడ్, బబూన్‌గ్రామ్‌కు చెందిన వాడుగా గుర్తించారు.

వివాహిత ఆత్మహత్య

భోగాపురం: మండలంలోని తూడెం గ్రామానికి చెందిన వివాహిత దువ్వ యల్లయ్యమ్మ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి ముగడ అప్పయ్యమ్మ, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముగడ గ్రామానికి చెందిన యల్లయ్యమ్మకు పది సంవత్సరాల క్రితం తూడెం గ్రామానికి చెందిన మేనమామ దువ్వ అప్పలసూరితో వివాహంజరిగింది. ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. ఈ మధ్య కాలంలో యల్లయ్యమ్మ కూలి పనులు చేసేందుకు సన్‌రే కంపెనీలో చేరింది. అక్కడ పనులు చేస్తుండగా చేపలకంచేరు గ్రామానికి శ్రీరపు పైడిరాజుతో పరిచయం ఏర్పడడంతో చనువుగా ఉండేది. అది గమనించిన భర్త అప్పలసూరి విషయాన్ని అత్త అప్పయ్యమ్మకు తెలియజేశాడు. దీంతో తల్లి కూతురు యల్లయ్యమ్మను మందలించింది. ఇదిలా ఉండగా పైడిరాజు మంగళవారం రాత్రి తూడెం గ్రామానికి వచ్చి యల్లయ్యమ్మతో మాట్లాడాడు. భార్యతో మాట్లాడడం చూసిన భర్త అప్పలసూరి పైడిరాజుతో గొడవకు దిగాడు. దీంతో యల్లయ్యమ్మ మనస్తాపం చెంది భర్తకు భయపడి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి పోయింది. ఎంతసేపటికీ భార్య రాకపోవడంతో అత్తకు ఫోన్‌లో సమాచారం అందించాడు. కుటుంబసభ్యులంతా రాత్రంతా చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ తెలియరాలేదు. బుధవారం వేకువజామున లేచి చూసేసరికి ఇంటికి కొంత దూరంలో ఉన్న ఉప్పిలి రాములు కొబ్బరితోటలో ఒక చెట్టు కొమ్మకు చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో 25 కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని ఎరుకొండ గ్రామంలో టీడీపీకి చెందిన 25 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు సమక్షంలో వారంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గ్రామ వైస్‌సర్పంచ్ ఆల్తి శ్రీను, వాశ్లె సత్యనారాయణ, తాడివాడ సీతారాం, వలిరెడ్డి దుర్గప్పడు,తాడివాడ అప్పలనాయుడు, తాడివాడ ఆదినారాయణ, తాడివాడ బంగారునాయుడుతో పాటు పలువురు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మహంతి కల్యాణి, వైస్‌ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసురావు, మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ: ముగ్గురికి గాయాలు

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి26పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి గజపతినగరం వస్తున్న కారు బోడసింగిపేట గ్రామం జంక్షన్‌లో రోడ్డుదాటుతున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న గురుబిల్లి ఉదయ్ కుమార్, బోడసింగి శ్రీనుతో పాటు మరొకరు గాయపడ్డారు. క్షతగాత్రులను గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలి మృతి

చీపురుపల్లి రూరల్ (గరివిడి):

మండలంలోని దువ్వాం గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారు నక్క దుర్గారావు(49) గుండెపోటుతో మృతి చెందాడు. రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం గ్రామానికి చెందిన ఉప్పరబంద చెరువులో జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లాడు. పని చేస్తుండగా ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో పడిపోయాడు. ఈ విషయాన్ని వెంటనే 108కి సమాచారం అందించగా సిబ్బంది వచ్చి చూసేసరికి ప్రాణాలు విడిచాడు. మృతుడి భార్య నక్క గౌరి ఫీల్డు అసిస్టెంట్ కాగా వారికి ఒక కుమార్తె ఉంది.

రఘు ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఎ ప్లస్ గుర్తింపు

విజయనగరం అర్బన్:

రఘు ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మక నాక్ ఎ ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించినట్లు విద్యాసంస్థల చైర్మన్ కలిదండి రఘు తెలిపారు. గత నెలలో కళాశాలను సందర్శించిన నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) నిపుణుల బృందం రెండు రోజులపాటు కళాశాలలో మౌలిక వసతులు, మానవ వనరులు, ప్రయోగశాలలు ప్రత్యక్షంగా పరిశీలించి అత్యుత్తమ ర్యాంకును అందించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు కళాశాలకు చేరాయని ఆయనతోపాటు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విజయ్‌కుమార్, డాక్టర్ పీఎస్‌ఆర్‌చౌదరి తదితరులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే రఘు ఇంజినీరింగ్ కళాశాల అటానమస్, ఎస్‌బీఏ గుర్తింపును సైతం కలిగి ఉందని, ప్రస్తుతం నాక్ ఎ ప్లస్ గుర్తింపుతో కళాశాల ప్రమాణాలు అత్యుత్తమంగా ఉన్నట్లు స్పష్టమైందని వివరించారు.

‘సెటిల్’ సర్వీస్ కుదరదిక..!

- వైద్యసిబ్బంది స్థానికంగా ఉండాల్సిందే
- జూన్ 1 నుంచి అమలు
- ఆదేశాలు జారీ చేసిన కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా అన్ని వేళలా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తోంది. వైద్యం అందలేదని ఏ ఒక్కరూ అనకూడదనే ఉద్దేశంతో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచేవిధంగా చర్యలు చేపట్టింది. గ్రామస్థాయిలో పనిచేసే వైద్యసిబ్బంది అందరూ ఇకపై పనిచేసే చోట నివాసం ఉండేవిధంగా వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో పనిచేసే ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు దూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి సమయంలో ఏదైనా సమస్య వస్తే ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇటువంటి పరిస్థితులు ఇకపై తప్పనున్నాయి.

24 గంటలు వైద్య సేవలకు హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు

గ్రామీణ ప్రాంత ప్రజలకు 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రతి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసింది. సచివాలయం పరిధిలోని గ్రామీణ ప్రజలకు ఏ సమస్య వచ్చినా విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేశారు. జలుబు, దగ్గు, జ్వరం, గాయాలైన వారికి, గర్భిణులకు సాధారణ ప్రసవం, బీపీ, సుగర్ పరీక్షలు చేయడం అవసరమైన వారికి మందులు వంటి సేవలు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అందించాలన్నది లక్ష్యం.అయితే ప్రస్తుతం విలేజ్ హెల్త్ క్లినిక్‌కోసం నియమించిన వైద్య సిబ్బంది జిల్లా కేంద్రం, మండల కేంద్రం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీని వల్ల గ్రామీణ ప్రజలకు అందాల్సిన వైద్య సేవలు అందడం లేదు. సాయంత్రం 5 గంటలకల్లా వైద్య సిబ్బంది వెళ్లిపోతున్నారు. ఆ తర్వాత ఏ అవసరం వచ్చినా దూర ప్రాంతంలో ఉన్న ఆస్పత్రులకు వెళ్తున్నారు.



గంట్యాడ మండలం పెదవేమలిలో వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న ఏఎన్‌ఎం

జారీ అయిన ఆదేశాలు

గ్రామస్థాయిలో పనిచేసే ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్)లు పనిచేసే చోట నివాసం ఉండాలని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు వారు నివసించే చిరునామాలను వైద్యారోగ్య శాఖ అధికారులు సేకరిస్తున్నారు. జిల్లాలో ఏఎన్‌ఎంలు 500 మంది, ఆశకార్యకర్తలు 1,790 మంది, ఎంఎల్‌హెచ్‌పీలు 499 మంది పనిచేస్తున్నారు. వారంతా ఇకపై స్థానికంగా ఉండాల్సిందే. జూన్ ఒకటో తేదీ నుంచి ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయనున్నారు.

పని చేసే చోట ఉండాల్సిందే



గ్రామస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది స్థానికంగా ఉండాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు పనిచేసే చోట నివాసం ఉండాలని స్పష్టం చేశాం.

– డాక్టర్ ఎస్వీ రమణకుమారి, డీఎంహెచ్‌ఓ

నా భూమి ఇప్పించండి

- కలెక్టర్‌కు వేడుకోలు

పార్వతీపురం: తన భూమి తనకు ఇప్పించాలని పార్వతీపురం మండలంలోని రేపటివలస గ్రామానికి చెందిన జన్ని సింహాచలం కలెక్టర్ నిషాంత్ కుమార్‌ను కోరాడు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను కలిసి అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం కింద తనకు భూమి కేటాయించగా ప్రస్తుతం అందులో జీడితోట సాగు చేస్తున్నామని తెలిపాడు. అయితే గ్రామానికి చెందిన యాండ్రాపు బలరాం, ఎం.రాములు బలవంతంగా తన భూమిని ఆక్రమించుకునేందుకు చూస్తున్నారని రెండేళ్లుగా జీడితోట ఫలసాయాన్ని తీసుకుంటున్నారని ఆరోపించాడు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్‌లో అర్జీని నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఏఓ ఉమా మహేశ్వరరావును ఆదేశించారు.

లక్ష్యానికి మించి అటవీ ఉత్పత్తుల కొనుగోలు

- జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర

పార్వతీపురం టౌన్: గిరిజన ప్రాంతంలో జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తులు కొనుగోలు వేగవంతం చేస్తున్నట్లు జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక జీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో చింతపండు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు ముమ్మరం చేశామని తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం రూ. 4.30 కోట్లు కాగా లక్ష్యానికి మించి రూ.10.35 కోట్ల విలువగల ఉత్పత్తులను కొనుగోలు చేశామని చెప్పారు. గ్రేడ్–1 రకం చింతపండు రూ.32.40కు కొనుగోలు చేస్తున్నామన్నారు. పిక్క తీసిన చింతపండు రూ.65కు మిగిలిన అన్ని రకాల అటవీ ఉత్పత్తుల కొనుగోలు కోసం ఇటీవల నిధులను మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర ద్వారా సమస్యలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో రైతులు నాణ్యమైన చింతపండు, జీడిపిక్కలు, ఇండుగ పిక్కలు, కరక్కాయ, కొండతామర జిగురు, కొండచీపుళ్లు, తేనె తీసుకుని వచ్చి జీసీసీ నిర్వహించిన గిట్టుబాటు ధరలు పొందాలని కోరారు.

బాలికను గర్భవతిని చేసిన యువకుడు



నిందితుడు అచ్చిబాబు తల్లిని విచారిస్తున్న సీడీపీఓ ఎస్తేరు రాణి, వివిధ శాఖల అధికారులు

భోగాపురం: మండలంలోని సవరవిల్లి గ్రామానికి చెందిన బోర అచ్చిబాబు(25) అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో లొంగదీసుకుని 3 నెలలు గర్భవతిని చేశాడు. అంతేకాకుండా ఎవరికి తెలియకుండా పెళ్లి చేసుకునేందుకు సిద్ధపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఏపీ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కేశలి అప్పారావు తక్షణమే స్పందించి బాలిక తల్లిదండ్రులు, అచ్చిబాబును విచారించి, నిందితుడిపై తగుచర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్తేరు రాణిని ఫోన్ ద్వారా ఆదేశించారు. దీంతో ఆమె ఏఎస్సై అప్పారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిశోర్, వీఆర్వో రామారావులతో కలిసి బుధవారం సాయంత్రం సవరవిల్లి గ్రామానికి చేరుకుని అచ్చిబాబు, బాలిక ఇళ్లకు వెళ్లి వారి తల్లులను విచారణ చేశారు. ఈ విచారణలో బాలికను అచ్చిబాబు గర్భవతిని చేసినట్లు తేలింది. గర్భవతి అయిన బాలికను విజయనగరంలోని స్వధార్ హోమ్‌కి తరలించాల్సి ఉండగా తరలించకుండా తమ కుమార్తెకు బాల్య వివాహం చేయబోమని రెవెన్యూ, పోలీసుశాఖ అధ్వర్యంలో వధువు తల్లి నుంచి అంగీకార పత్రం తీసుకుని సీడీపీఓ ఎస్తేరు రాణి అక్కడి నుంచి వెనుదిరిగారు. విచారణలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్, అంగన్‌వాడీ కార్యకర్త, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ- స్టాంపు పేపర్లతోనే లావాదేవీలు

- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ పి.విజయలక్ష్మి



పి.విజయలక్ష్మి, డీఐజీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, విజయనగరం

విజయనగరం రూరల్: రిజిస్ట్రేషన్ల శాఖలో ఇప్పటివరకు ఉన్న నాన్ జ్యుడిషియల్ స్టాంపులకు ప్రత్యామ్నాయంగా ఈ స్టాంపుల విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఇక నుంచి అన్ని లావాదేవీలు ఈ స్టాంపింగ్ విధానంలోనే సాగనున్నాయని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ పి.విజయలక్ష్మి బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ స్టాంపింగ్ విధానం ద్వారా ప్రజలకు సేవలు అందుతాయని చెప్పారు. స్టాంపుల విక్రయ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకుంటే స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ సత్వరమే లైసెన్సులు మంజూరు చేస్తుందని వివరించారు. నూతన విధానానికి చట్టబద్ధత కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆమె పేర్కొన్నారు. ఈ స్టాంపింగ్ కేంద్రాల లైసెన్స్ వెండర్ల వివరాలను సంబంధిత వెబ్‌సైట్లలో సంప్రదించడం ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకుల్లో ఈ విధానం వినియోగంలో ఉందని ఆమె తెలిపారు. సులభంగా, వేగవంతంగా సేవలందించే ఈ నూతన విధానాన్ని ప్రజలు అనుసరించి విస్తృత సేవలు పొందాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఈ సేవలు అందుతాయని స్పష్టం చేశారు.